


త్రిలోకపావని.. త్రిపురసుందరి

దేవీ శరన్నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వివిధరూపాల్లో జగన్మాత కనువిందు చేస్తున్నారు. చందోలు బండ్లమ్మ, మార్టూరులోని దుర్గాదేవి ఆదివారం శ్రీలలితాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల వద్ద ఆధ్యాత్మిక కోలాహలం నెలకొంది.

– న్యూస్‌టుడే, మార్టూరు, పిట్టలవానిపాలెం

చందోలు బండ్లమ్మ అమ్మవారు



మార్టూరులో అలంకరణ

ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై దృష్టి

గుంటూరు: రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నందున, వాటి అమలుకు సిబ్బంది కృషి చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టరు విజయలక్ష్మి అన్నారు. ఉపాధి హామీ పథకం విజిలెన్స్ విభాగం జిల్లా అధికారిగా పని చేస్తున్న ఆమెను డీఆర్‌డీఏ పీడీగా ప్రభుత్వం ఇటీవల బదిలీ చేసింది. దాంతో ఇప్పటి వరకు పనిచేసిన పీడీ వై.హరిహరనాథ్ విధుల నుంచి శనివారం రిలీవ్ కాగా విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. డీఆర్‌డీఏ- వెలుగు కార్యాలయం విభాగాల ఏపీవోలు, డీపీఎంలు,సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేశారు.

ఈనాడు
బాపట్ల

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

రేపు బాపట్లలో విజన్-2047 కీలక సమావేశం

ప్రతిపాదనలతో హాజరుకానున్న ఎమ్మెల్యేలు

ఈనాడు, బాపట్ల

రాష్ట్ర ప్రభుత్వం విజన్- 2047కు లక్ష్యాలు నిర్దేశించుకుంది. అందులో భాగంగా జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి వాటిని దీర్ఘ, స్వల్పకాలంలో పూర్తి చేయాలని సంకల్పించింది. జిల్లాలో చేపట్టాల్సిన పనులపై చర్చించి తుది నిర్ణయం తీసుకోవటానికి మంగళవారం జిల్లా ప్రజాప్రతినిధులతో కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలను ఆహ్వానించారు. దీనికి జిల్లా యంత్రాంగం పీపీటీ తయారు చేసింది. నియోజకవర్గాల వారీగా ఉన్న సమస్యలివీ.



జిల్లా కేంద్రం బాపట్లలో తాగునీటి సమస్య నివారణకు రెండో తాగునీటి చెరువు అవశ్యం. మూడు, నాలుగు దశాబ్దాల క్రితం ఉన్న ఏకైక చెరువుతోనే పట్టణవాసులకు తాగునీరందిస్తున్నారు. పెరిగిన జనాభా, పట్టణ విస్తరణతో ప్రస్తుతం ఉన్న తాగునీటి చెరువు నీరు సరిపోవడం లేదు. పక్కనే మరో వంద ఎకరాల్లో నూతన చెరువు ఏర్పాటు చేస్తే నీటి సమస్య తీరుతుంది. దీనికి అవసరమైన భూసేకరణకు నిధులు కేటాయించాలి. సూర్యలంకను పర్యాటకంగా మరింతగా తీర్చిదిద్దాలి.



వేమూరు నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయాధారితం. వరి, తెల్ల మొక్కజొన్న ఎక్కువగా పండుతుంది. ఇక్కడ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు అవకాశాలు మెండు. జంపని చక్కెర కర్మాగారం మూతపడింది. మిల్లుకు చెందిన 78 ఎకరాల విలువైన భూమి వృథాగా ఉంటోంది. ఆ భూముల్లో ఫుడ్ ప్రాసెసింగ్, ఇతర పరిశ్రమలు ఏర్పాటు చేస్తే మేలు. వరదలకు పంటలు ముంపు బారిన పడకుండా చిన్న మధ్య, ప్రధాన డ్రెయిన్లు, కట్టలు బలోపేతం చేయాలి.



చీరాలకు సమీపంలో ఉన్న రామాపురం బీచ్‌కు శని, ఆదివారం రోజున సందర్శకులు పోటెత్తుతున్నారు. స్థానికంగా ఉన్న హోటళ్లలో గదులు ముందుగానే బుక్ అయిపోతున్నాయి. ప్రధాన రహదారికి సమీపంలో బీచ్ ఉండటం అనుకూలం. ఈ బీచ్‌లను మరింత అభివృద్ధి చేయాలి. వాడరేవు ఫిషింగ్ హార్బర్ నిర్మాణం శంకుస్థాపనకే పరిమితమైంది. అవసరమైన భూమిని కేటాయించి పనులు పూర్తిచేస్తే మత్స్యకారులకు ఉపాధి దొరుకుతుంది. మత్స్య సంపదను బాగాపెంచుకోవచ్చు. చేనేత పార్కు కలగానే మిగిలింది. చీరాల పట్టణం వైకుంఠపురం వద్ద రూ.50 కోట్లతో ఆర్వోబీ నిర్మాణం పట్టణవాసుల చిరకాల కోరిక. దానిని నెరవేర్చాల్సి ఉంది.



పర్చూరు నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్యలపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. తాగునీటి చెరువుల్లో తూటికాడ, నాచు బాగా పేరుకుపోయి నీళ్లు కలుషితమవుతున్నాయి. పర్చూరు-యద్దనపూడి మండలాల్లో చెరువులకు తాగునీరందించేందుకు నెదర్లాండ్ పథకంలో భాగంగా అమర్చిన పైపులు శిథిలావస్థకు చేరాయి. చెరువులకు సాగర్‌జలాలు చేరటం లేదు. నూతన పైపులైన్ ఏర్పాటు చేసి దాహార్తి సమస్యలు తీర్చే పనులు చేపట్టాలి.



అద్దంకిలో నామ్‌రహదారి అసంపూర్తిగా ఉండటంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అద్దంకి, గోపాలపురం, చక్రాయపాలెం, ఏల్చూరులో ఈ పనులు పూర్తి చేయాల్సి ఉంది. గుండ్లకమ్మ జలాశయం నుంచి భవనాశి రిజర్వాయర్‌కు నీళ్లు చేర్చి దాని పరిధిలోని 7294 హెక్టార్ల ఆయకట్టు వినియోగంలోకి తెచ్చేలా రూ.27 కోట్లతో చేపట్టిన పనులు తుదిదశలో నిలిచిపోయాయి. వాటిని పూర్తి చేయాలి. కొరిశపాడు ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తే 5 వేల ఎకరాలు సాగులోకి వస్తుంది.



రేపల్లె నియోజకవర్గం దిండి ఆక్వాపార్కు, నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్‌కు గత ప్రభుత్వం హడావుడిగా పనులు ప్రారంభించింది. వాటికి సంబంధించిన ప్రాజెక్టులకు కూటమి ప్రభుత్వంలోనే భూసేకరణ సమస్య కొలిక్కివచ్చింది. దీన్ని పట్టాలెక్కిస్తే మత్స్యకారులకు ఉపాధితోపాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. నియోజకవర్గంలో పంటకాల్వలు, మురుగుకాల్వలు ఆధునికీకరణ చేపట్టాలి. మడ అడవుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి.

ప్రకృతి సోయగం.. శింగరకొండ సొంతం

ప్రకృతి రమణీయతకు అద్దం పడుతోంది శింగరకొండ ప్రాంతం. నామ్ రహదారి మెలికలు తిరిగి ఉండగా.. మరో వైపు నిండుగా భవనాశి తటాకం, ఇంకోవైపు చేపల పెంపక కేంద్రం, పచ్చని పొలాలు, శింగరకొండ ఉన్నాయి. ఆహ్లాదకర వాతావరణం కలిగి ఉండటంతో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో భవనాశిలో బుద్ధవిగ్రహం, నామ్ రహదారి అంచులో రిసార్టులు ఏర్పాటు చేయాలని దశాబ్దకాలం క్రితం ప్రభుత్వం ఆలోచించింది. సరైన నిధులు, మార్గదర్శకులు లేని కారణంగా ఈ ప్రాజెక్టు వాయిదా పడింది. శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద నుంచి చూస్తే ప్రకృతి సోయగం కనుల పండువగా ఉంటుంది.

- అద్దంకి, న్యూస్‌టుడే



ప్రతి ఎకరాకు సాగు నీరు: మంత్రి

సంతమాగులూరు, న్యూస్‌టుడే: అద్దంకి బ్రాంచి కాలువ(ఏబీసీ)కు దిగువనున్న ఆయకట్టులోని ప్రతి ఎకరాకు సాగు నీరు అందించడమే లక్ష్యమని విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. అద్దంకి బ్రాంచి కాలువపై ఆయన ఆదివారం పర్యటించారు. జిల్లా పరిధి ప్రారంభమయ్యే అడవిపాలెం 18/0 మైలు వద్ద నీటి విడుదలను పరిశీలించారు. అనంతరం రైతులు, ఎన్నెస్పీ అధికారులతో సాగు నీటి సరఫరాలో ఎదురవుతున్న అవరోధాల గురించి సమీక్షించారు. రాబోయే వారం రోజుల్లో యుద్ధప్రాతిపదికన కాలువలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం మరమ్మతుల విషయంలో శ్రద్ధ చూపకపోవడం వల్ల ప్రస్తుతం ఏబీసీకి 1,200 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తే వృథా అవుతోందన్నారు. కాలువల్లో పూడిక తీయక, మరమ్మతులు లేక కరకట్టలు బలహీనమై గండ్లు పడే పరిస్థితి నెలకొందన్నారు. తక్షణం ఎన్నెస్పీ అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పూర్తి చేయాలన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు షట్టర్ల ఏర్పాటు, భవనాశి రిజర్వాయ పనులు పూర్తి చేయడం తదితర పనులను పూర్తి చేసి, సాగు నీటి ఇబ్బంది లేకుండా చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఆయన వెంట ఎన్నెస్పీ డీఈ లక్ష్మీనారాయణ, నేతలు తేలప్రోలు రమేష్, గాడిపర్తి వెంకట్రావు, కామాను శ్రీనివాసరావు, తదితరులున్నారు. ఏల్చూరులో మంత్రి అతిథి గృహంలో తెదేపా నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు.



అడవిపాలెం వద్ద నీటిని పరిశీలిస్తున్న మంత్రి రవికుమార్

16 నుంచి కృష్ణానదిలో ఇసుక తవ్వకాలు



మాట్లాడుతున్న కలెక్టర్ మురళి, అదనపు ఎస్పీ విఠలేశ్వర్

బాపట్ల: భవన నిర్మాణదారులకు ఇసుక అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. కలెక్టరేట్లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాలో ఇసుక అందుబాటులో లేదన్నారు. ఇసుక కావాల్సిన వారు గుంటూరు జిల్లా తాళ్లాయపాలెం, పల్నాడు జిల్లా మాదిపాడు నుంచి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని తెప్పించుకోవచ్చన్నారు. ప్రస్తుతం కృష్ణానదిలో 45 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉందన్నారు. జిల్లాలో గాజుల్లంక, జువ్వలపాలెం రీచ్‌లో ఈ నెల 16 నుంచి గనులశాఖ ఆధ్వర్యంలో మనుషులతో ఇసుక తవ్వకాలు చేపట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నదిలో నీటి ప్రవాహం తగ్గకుంటే తవ్వకాలకు మరో వారం వరకు ఆగాల్సి ఉంటుందన్నారు. రెండు రీచ్‌లలో లక్షన్నర మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వి తీయటానికి అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారన్నారు.

ఏడాదికి 4లక్షల మెట్రిక్ టన్నులు..

జిల్లాలో భవన నిర్మాణ రంగానికి ఏడాదికి నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరం ఉందన్నారు. కొత్తగా గాజుల్లంక-2, ఓలేరులో ఇసుక రీచ్‌లు గుర్తించామన్నారు. ఇవి కాకుండా మరో రెండు రీచ్‌లలో తవ్వకాలకు అవకాశం ఉందన్నారు. నదిలో ఆరు రీచ్‌లలో తవ్వకాల ద్వారా 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యమవుతుందని వివరించారు. పట్టా భూముల్లో తవ్వకాల ద్వారా మరో 1.50 లక్షల మెట్రిక్ టన్నులు కలిపి జిల్లాలో మొత్తం ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. ఇసుక తవ్వకాలు జరిగే రీచ్‌లలో డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిఘా పెడతామన్నారు. ఇసుక తవ్వకాల్లో అక్రమాలు చోటుచేసుకోకుండా గట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా అడ్డుకోవటానికి పోలీసులు, గనులశాఖ అధికారులతో కలిసి జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ విఠలేశ్వర్, గనుల శాఖ ఏడీ రాజేష్ పాల్గొన్నారు.

రెండోరోజూ కొనసాగిన వైద్య శిబిరం

15 మందికి పరీక్షలు


రోగిని పరీక్షిస్తున్న సీహెచ్‌వో ప్రశాంతి

పెదగంజాం (చినగంజాం): పెదగంజాం పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డికొత్తగొల్లపాలెం, ఆవులదొడ్డిపాతగొల్లపాలెం గ్రామాల్లో రెండో రోజైన ఆదివారం ఇంటింటికీ 14 మంది వైద్య సిబ్బందిని పంపి, సర్వే చేయించినట్లు చినగంజాం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి ఎస్. విజయభాస్కరరావు తెలిపారు. వీధుల్లోనూ, పాఠశాలలు, బహిరంగ ప్రదేశాల్లో బ్లీచింగ్, అబేటు మందు చల్లించారు. కొత్తగొల్లపాలెంలో వైద్య శిబిరం ఏర్పాటుచేసి 15 మందికి పరీక్షలు చేసినట్లు చెప్పారు. వారిలో నొప్పులతో బాధ పడుతున్న నలుగురికి ర్యాపిడ్ పరీక్షలు చేయగా, డెంగీ, మలేరియా జ్వరాలు లేవని తెలిపారు. వివరాలను ఉన్నతాధికారులకు నివేదించినట్లు వివరించారు. రెండు గ్రామాల్లో మరికొన్ని రోజుల పాటు ఇంటింటికీ సర్వే చేయించనున్నట్లు విజయభాస్కరరావు వెల్లడించారు.


కొత్తగొల్లపాలెం వీధుల్లో బ్లీచింగ్ చల్లిస్తున్న సిబ్బంది

కలగా భవనాశి రిజర్వాయరు

- ఐదేళ్లుగా జలాశయం వైపు కన్నెత్తి చూడని గత పాలకులు
- ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారిస్తేనే పూర్తయ్యేది

అద్దంకి, న్యూస్‌టుడే

బహుళార్థసాధక జలాశయాల్లో ఒకటిగా నిలిచిన భవనాశి బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలిది. దివంగత వైఎస్. రాజశేఖరరెడ్డి హయాంలో నిర్మాణం ప్రారంభమైనప్పటికీ గత వైకాపా ప్రభుత్వం ఈ జలాశయం వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. చేశారు. భూ సేకరణ, ఆనకట్ట, భవనాశి చెరువు అభివృద్ధి, కాలువ ఏర్పాటు ద్వారా పనులు వేగంగా పూర్తి చేయాలని భావించారు. దాదాపు 90 శాతం నిర్మాణ పనులు పూర్తి అయినప్పటికీ పదిశాతం పనుల కోసం జలాశయాన్ని ఎండగట్టారనే అపవాదు వైకాపా ప్రభుత్వంపై ఉంది. ఆయకట్టు పరిధిలోని 7294 ఎకరాల రైతులకు ఏడాదిలో ఎకరాగు కనిష్ఠంగా రూ.10 వేల వరకు ఆదాయం సమకూరేది. అది కోల్పోయారు. మాగాణి, మెట్ట పంటలు పండించుకునే అవకాశం ఉన్న ఈ భూముల్లోని రైతులు వర్షాధారిత పంటలు సాగు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.


భవనాశి చెరువు


చక్రాయపాలెం వద్ద తవ్విన కాలువ

తాజాగా అధికారం చేపట్టిన కూటమి సర్కారైనా దీన్ని పూర్తి చేసి ఆయకట్టు రైతుల ఆశలు నెరవేరుస్తుందని ఎదురు చూస్తున్నారు.

మాగాణి, మెట్ట పంటలు పండించే అవకాశం ఉన్నా..

భవనాశి బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నిర్మాణ పనుల్ని నాలుగు విభాగాలుగా

పూర్తి చేయాలనేది మంత్రి ఆకాంక్ష

భవనాశి జలాశయం నిర్మాణ పనులు ఐదేళ్ల నుంచి అడుగు ముందుకు పడలేదు. ఈవిషయమై రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చర్చించారు. ఎలాగైనా నిర్మాణ పనులు పూర్తి చేసి రైతుల ఆయకట్టుకు నీరు ఇవ్వాలని చెప్పారు. తదనుగుణంగా తాజా అంచనాలు తయారు చేస్తున్నాం. ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తాం. అనంతరం నిర్మాణం పూర్తి చేసే అవకాశం ఉంది. - శివరాంప్రసాద్, డీఈ, నీటిపారుదల శాఖ

జలాశయం పేరు	– భవనాశి బ్యాలెన్సింగ్ రిజర్వాయరు
అంచనా విలువ	– రూ.27 కోట్లు
ఆయకట్టు	– 7,294(7300 ఎకరాలు)
లబ్ధిపొందే గ్రామాలు	– భవనాశి ఆయకట్టు 3594 (1797 ఎకరాల్లో రెండు పంటలు), శింగరకొండపాలెం ఎత్తిపోతల 3500 ఎకరాలు, వెంపరాల చెరువు ఆయకట్టు 200 ఎకరాలు
అదనంగా కేటాయించింది	– రూ.20 కోట్లు (2014–19 తెదేపా హయాం)
పనులు ప్రారంభించింది	– 2009 జూన్
పూర్తి కావాల్సింది	– 2019 మే నాటికి
పూర్తయిన పనులు	– 90 శాతం
పెండింగ్ పనులు	– విద్యుత్తు స్తంభాల తొలగింపు, కాలువలో రాళ్ల బ్లాస్టింగ్‌కు అనుమతులు


బాషాను బయటకు తీసుకొస్తున్న పోలీసులు, గజ ఈతగాళ్లు

సంద్రంలో మునిగిపోతుండగా కాపాడారు

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: సముద్రంలో మునిగిపోతున్న ఒక వ్యక్తిని సాహసం చేసి గజ ఈతగాళ్లు, మెరైన్ పోలీసులు కాపాడిన సంఘటన చీరాల మండలం వాడరేవు తీరంలో ఆదివారం చోటుచేసుకుంది. మెరైన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నరసరావుపేటకు చెందిన షేక్ బాషా తన మిత్రులతో కలిసి ఆదివారం వాడరేవు వచ్చారు. సముద్ర స్నానం చేస్తుండగా.. అలల తాకిడికి లోపలకి వెళ్లారు. మునిగిపోతున్న అతడ్ని అక్కడే విధుల్లో ఉన్న మెరైన్ హెచ్‌సీ ప్రసాద్, పవన్ గమనించారు. వెంటనే స్థానికంగా ఉన్న గజ ఈతగాళ్లు ఎస్. రాము, వి. గోపిలను అప్రమత్తం చేశారు. వీరితో పాటు మెరైన్ సిబ్బంది సురేంద్ర, శ్రీను, డేవిడ్‌లు లైఫ్ జాకెట్లు తీసుకుని లోపలకి వెళ్లి అతడ్ని కాపాడి బయటకు తీసుకొచ్చారు. దీంతో బాషా బంధుమిత్రులు ఊపిరి పీల్చుకున్నారు.

వృద్ధులు సమాజ ఆస్తి


సన్మానిస్తు న్న డీఎస్పీ జగదీష్, ప్రతినిధులు

చీరాల, న్యూస్‌టుడే: తమ జీవితకాలంలో ఎంతో అనుభవాన్ని సంపాదించిన వృద్ధులు సమాజానికి ఆస్తి వంటివారని, వారిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని డీఎస్పీ పి. జగదీష్‌నాయక్ పేర్కొన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని ఆదివారం వృద్ధుల సంక్షేమ భవనంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ సమాజాభివృద్ధికి వివిధ రంగాల్లో నిపుణులైన వృద్ధుల సేవలు ఉపయోగించుకోవాలన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంపరాల నారాయణమూర్తి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో వృద్ధులు అనేక రకాలుగా వివక్షతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధుల సంక్షేమ చట్టం అమలు చేసి వారికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అన్ని చోట్ల రాయితీలు, ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రతి నియోజకవర్గంలో వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలు అందించిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు కె. నిర్మల, గాదె హరిహరరావు, ఏకాంబరేశ్వర బాబు, ఎ. నాగవీరభద్రాచారి, సత్రం మల్లేశ్వరరావు, పి. రామకృష్ణ, రాజ్‌వినయ్‌కుమార్, ఎ. రామారావు, నాగమాంబ, జీవీ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల నిరసన

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఇంకొల్లు పంచాయతీ కార్మికులు వేతనాలు చెల్లించటంలేదంటూ ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. మూడు మాసాలుగా వేతనాలు చెల్లించకపోవటంతో వారం రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గత డిసెంబరులో వేతనాల కోసం నెల పాటు కార్మికులు సమ్మె చేయటంతో చెత్తపేరుకుపోయి, గ్రామస్థులు ఇబ్బంది పడ్డారు. స్థానిక పెద్దల చొరవతో సమ్మె విరమించి విధుల్లో చేరారు. ప్రభుత్వం మారినా కార్మికులకు ప్రతినెలా వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతూనే ఉన్నారు. పంచాయతీలో రూ.2 కోట్లమేర అవినీతి జరిగింది. విచారణ జరిగి ఏడాది కావస్తున్నా దోషులెవరో తేలలేదు. జరుగుతున్న కుంభకోణాల కారణంగా ఇంటి పన్నులు వసూలు కావటంలేదు. గతంలో పలువురు గృహస్థులు పన్నులు చెల్లించినా పంచాయతీలో జమ కానందున వారు బకాయి ఉన్నట్లు నోటీసులు పంపుతున్నారు. దీంతో పన్ను వసూళ్లు పూర్తిగా నిలిచిపోయింది.


నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రస్తుతం కార్మికులకు వేతనాలు చెల్లించలేని దుస్థితి నెలకొంది. ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి బదిలీ కావటంతో సమస్య మరింత జటిలం కానుంది. పంచాయతీలో జరిగిన అవినీతి కారణంగా సర్పంచి చెక్‌పవర్ రద్దుచేసి ఎంపీడీవోకు అప్పగించారు. ఆదివారం కార్మికులు పంచాయతీ కార్యాలయ ఆవరణలో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ నిర్ణయించుకున్నారు. సీపీఎం నాయకుడు వెంకట్రావు పాల్గొన్నారు.


శింగరకొండ వద్ద క్యూలో భక్తులు

నూతన భవనంలో కార్యకలాపాలు

శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం పరిపాలనా కార్యకలాపాలు నూతన భవనం నుంచి మొదలయ్యాయి. రెండు నెలల క్రితం ఈ నూతన పరిపాలనా భవనాన్ని ప్రారంభించారు. గతంలో గుడి ప్రాంగణంలోనే సహాయ కమిషనర్ కార్యాలయం, టిక్కెట్, ప్రసాదాల కౌంటర్ ఉండేవి. ఈక్రమంలో లోపల రాతి ముఖమండపం నిర్మాణ పనులకు ఆటంకంగా ఉన్న టిక్కెట్ కౌంటర్‌ను ఆలయం వెలుపల దుకాణం వద్దకు మార్పు చేశారు. దీంతో భక్తులు దేవాలయం వద్దకు రాగానే ఎదురుగా ఉండే టిక్కెట్ కౌంటర్ వద్ద టిక్కెట్ తీసుకుని, దర్శనం కోసం వెళుతున్నారు. అలాగే గుడి లోపల క్యూలైన్‌లో భక్తులకు ఇబ్బంది లేకుండా మార్పులు చేస్తున్నారు.

గర్భిణికి పురుడు పోసిన 108 సిబ్బంది


బిడ్డతో 108 సిబ్బంది

సంతమాగులూరు: అత్యవసర పరిస్థితిలో ఉన్న గర్భిణికి సంతమాగులూరు 108 వాహన సిబ్బంది వాహనంలో పురుడు పోసి తల్లి, బిడ్డను కాపాడారు. 108 వాహన సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మాచర్ల గ్రామానికి చెందిన ఎం. శ్రావణికి శనివారం పురిటి నొప్పులు రావడంతో మాచర్ల వైద్యశాల నుంచి నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి 108 వాహనంలో తరలించారు. ఆమెకు రక్తం తక్కువగా ఉన్న కారణంగా నరసరావుపేట వైద్య సిబ్బంది ఆమెను గుంటూరు సర్వ జన ఆసుపత్రికి తీసుకెళ్లాలని సిఫారసు చేశారు. ఈ క్రమంలో పరిస్థితి అత్యవసరంగా ఉండటంతో గతంలో ఆమె చికిత్స పొందిన నరసరావుపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కానీ వారు కాన్పు చేయడానికి నిరాకరించడంతో విధి లేని పరిస్థితిల్లో ఆమెను గుంటూరు సర్వ జన ఆసుపత్రికి ఆదివారం తెల్లవారుజామున తరలిస్తుండగా మార్గమధ్యలో ఫిరంగిపురం వద్ద నొప్పులు అధికమయ్యాయి. ఈ క్రమంలో 108 వాహన సిబ్బంది ఖాదర్‌మస్తాన్ ఆమెకు పురుడు పోశారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రపంచ శాంతి కాంక్షించిన ఏచూరి

మార్టూరు, న్యూస్‌టుడే: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి అభిమానులు ఘన నివాళి అర్పించారు. ఆదివారం మర్టూరు విశ్రాంత ఉద్యోగుల భవనంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్యనేతగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి. కృష్ణయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మంజుధార్, విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావుల బాపయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల హనుమంతరావులు హాజరై సభలో ప్రసంగించారు. వారు మాట్లాడుతూ ప్రపంచ శాంతిని కాంక్షించే మహోన్నతుల్లో సీతారాం ఏచూరి ఒకరని కొనియాడారు. సభలో రైతుసంఘం జిల్లా నేత కందిమళ్ల రామకోటేశ్వరరావు పాటు వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కృష్ణయ్య

దారి దోపిడీ కేసులో పాత నేరస్థుల అరెస్టు

రూ.4.13 లక్షల సొత్తు స్వాధీనం

వేటపాలెం, న్యూస్‌టుడే: దారి దోపిడీ కేసులో నలుగురు పాత నేరస్థులను పోలీసులు అరెస్ట్ చేయగా మరొకరు పరారీలో ఉన్నారు. వీరి నుంచి ద్విచక్ర వాహనాలు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ జగదీష్ నాయక్ స్థానిక పోలీసు స్టేషనులో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. గతనెల 30న నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడుకి చెందిన పెదపూడి షాలెం రాజు తన తల్లిని చీరాల రైల్వేస్టేషను నుంచి తీసుకొచ్చేందుకు ప్లాటినం ద్విచక్రవాహనంపై తెల్లవారుజామున బయలుదేరి, పందిళ్లపల్లి ఎర్రగేటు దాటిన తరువాత మూత్రవిసర్జనకు ఆగారు. ఈసమయంలో అయిదుగురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చి, రాజును ఇనుపరాడ్‌తో బెదిరించి అతని వాహనంతో పాటు చరవాణిని తస్కరించుకెళ్లారు. దీనిపై బాధితుడు వేటపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు వీరిని పట్టుకోవడానికి మూడు బృందాలు ఏర్పాటుచేశారు. దీనిలో భాగంగా గుంటూరు జిల్లా పొన్నూరికి చెందిన షేక్ మదార్ ఉరఫ్ హనీ, ఒంగోలుకు చెందిన దేవరకొండ మదన్ సాయి, బాపట్ల మండలం ఉప్పరపాలేనికి చెందిన చేగోడి ఆనందబాబు ఉరఫ్ నాని, బాపట్లలోని బేతాన్ కాలనీ వాసి వంశీకృష్ణ కలిసి శనివారం రాత్రి చీరాల-వేటపాలెం బైపాస్ రోడ్డులోని ఒక బిర్యానీ పాయింట్ సమీపంలో ఉన్నారు. ఆసమయంలో అటుగా వెళుతున్న పోలీసుల జీపును చూసి వీరు పరుగు లంకించుకోవడంతో వారిని ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకుని విచారించారు. పైన జరిగిన దారి దోపిడీలో తమతో పాటు బాపట్ల శారదాపురి కాలనీకి చెందిన షేక్ సైదా ఉన్నట్లు ఒప్పుకొన్నారు. ప్రస్తుతం ఇతడు పరారీలో ఉండడంతో వీరిని అరెస్ట్ చేసి అయిదు ద్విచక్రవాహనాలు, 22 సెల్‌ఫోన్లు, నగదు రూ.2,200 కలిసి రూ.4.13 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులపై పలు స్టేషన్లలో కేసులు ఉండడంతో పాటు జైలుకు వెళ్లారని డీఎస్పీ చెప్పారు. వీరిని న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నట్లు చెప్పారు. ఈ కేసును ఛేదించిన గ్రామీణ సీఐ శేషగిరిరావు, ఎస్సై మీసాల వెంకటేశ్వర్లు, సిబ్బంది అచ్చయ్య, బాజీత్, ప్రసాదు, బలరామయ్య, శ్రీనివాసరావు, దయానంద్, శివకుమార్, శివకృష్ణలను జిల్లా ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జగదీష్ నాయక్, పక్కన సీఐ శేషగిరిరావు, ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బంది

పాత కక్షలతో హత్య


నున్నా భూషయ్య (పాత చిత్రం)

నగరం, న్యూస్‌టుడే: గ్రామంలో దసరా ఉత్సవాలు నిర్వహించే విషయంలో గ్రామస్థుల మధ్య ఏర్పడిన వివదాం హత్యకు దారి తీసింది. నిజాంపట్నం ఎస్సై శివప్రసాద్ కథనం ప్రకారం. నగరం మండలం తాడివాకవారిపాలెం శివారు దాసరిపాలేనికి చెందిన నున్నా భూషయ్య(50) ఇదే గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు, బాలకోటేశ్వరరావు కలసి నిజాంపట్నం మండలం బావాజీవారిపాలెం శివారులో శనివారం రాత్రి సుమారు పది గంటల ప్రాంతంలో ముగ్గురు కలసి మద్యం తాగారు. మద్యం మత్తులో పాత వివాదాలు తలెత్తడంతో వెంకటేశ్వరరావు, బాలకోటేశ్వరరావు పక్కనే ఉన్న సెంట్రింగ్ కర్రతో భూషయ్య తలపై బలంగా కొట్టారు. చావు బతుకుల్లో ఉన్న భూషయ్యను రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు అజయ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కృష్ణానదిలో యువకుడి గల్లంతు


నరేష్ (పాత చిత్రం)

కొల్లూరు: .కృష్ణానది వద్దకు విహార యాత్రకు వెళ్లిన యువకుల్లో ఒకరు గల్లంతయ్యాడు. తెనాలి బీసీ కాలనీకి చెందిన బొట్టపాటి నరేష్ (20) అదే కాలనీకి చెందిన ఆరుగురు మిత్రులతో కలిసి ఆదివారం విహారయాత్రకు ద్విచక్రవాహనాలపై బయలుదేరి బాపట్ల జిల్లా చిలుమూరు సమీపంలోని కృష్ణానది వద్దకు చేరుకున్నారు. వీరంతా ఈత వేసేందుకు నదిలోకి దిగారు. నరేష్ మరో ఇద్దరు మిత్రులతో కలిసి నీటిలో బంతితో ఆడుకోవడం ప్రారంభించారు. ఈ క్రమంలో నీటి ప్రవాహంలో కొట్టుకుపోతున్న బంతిని తీసుకువచ్చే ప్రయత్నంలో నరేష్ గల్లంతయ్యాడు. ప్రవాహంలో కొట్టుకు పోతున్న అతడిని రక్షించేందుకు ప్రయత్నించిన ఓ మిత్రుడు అతి కష్టం మీద బయట పడి ప్రాణాలు దక్కించుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్సై ఏడుకొండలు ఘటనా స్థలానికి చేరుకుని గాజుల్లంకకు చెందిన మత్స్యకారుల సహాయంతో నరేష్ కోసం పడవలపై గాలింపు చర్యలు చేపట్టారు. అతని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కృష్ణానది ఒడ్డుకు చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు.

పాము కాటుకు గురై రైతు మృతి


మృతుడు శాంసన్

కొల్లూరు: పొలంలో పనులు చేసుకుంటున్న సమయంలో ఈపూరులంకకు చెందిన శొంఠి శాంసన్ (48)ను పాము కాటు వేయడంతో అతడు పొలంలోనే మరణించిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. మధ్యాహ్నం సమయంలో మృతుడు తన నివాసం నుంచి కొద్ది దూరంలో ఉన్న పొలంలోకి వెళ్లి పనులు చేసుకుంటున్న సమయంలో పాము కాటు వేసింది. దీంతో అతడు సంఘటనా స్థలంలో నుంచి పరుగులు తీసుకుంటూ ఇంటికి బయలుదేరి సుమారు రెండు పర్లాంగుల దూరంలోని ఓ పొలంలో కుప్పకూలిపోయాడు. కొద్ది దూరంలో ఉండి గమనించిన అతడి బంధువు వెంటనే అక్కడకు చేరుకుని, పరిశీలించి కాలిపై పాము కాటు గుర్తులను గమనించి అనంతరం అతడు మృతి చెందాడని భావించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించాడు. ఏఎస్సై రామయ్య సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరీక్షల నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, రిటైల్ ధర - 145, చికెన్ విత్‌స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 138, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.86/-.

పురుగు మందుల అమ్మకాల నిలిపివేత

వినుకొండ రూరల్, వినుకొండ: రికార్డులు సక్రమంగా నమోదు చేయని పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేస్తున్నట్లు వినుకొండ మండల వ్యవసాయాధికారి అంజిరెడ్డి తెలిపారు. 'అక్షరంతో ఏమార్చి.. అన్నదాతను దోచేసి' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన వ్యవసాయాధికారులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. వినుకొండలోని వెన్నపూస కాలనీలో బయో మందుల తయారీతో పాటు అమ్మకాలు జరిపే కిసాన్ అగ్రి టెక్నాలజీ యూనిట్, ఆ దుకాణంలో తనిఖీలు చేశారు. నిల్వ ఉన్న మందులకు, రికార్డులకు పొంతన లేకపోవడంతో రూ.3,13,968 విలువైన బయో మందుల అమ్మకాలు నిలిపేసినట్లు ఏవో తెలిపారు.

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

పురపాలక కమిషనర్‌గా రఘునాథరెడ్డి



బాపట్ల, న్యూస్‌టుడే: పురపాలక సంఘం నూతన కమిషనర్‌గా జి.రఘునాథ రెడ్డి నియమితులయ్యారు. ప్రొద్దుటూరు నుంచి ఆయన బదిలీపై బాపట్ల వస్తున్నారు. కొత్త కమిషనర్ సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు. కేంద్ర ఆర్థిక శాఖ సీసీఏఎస్ విభాగం డిప్యూటేషన్‌పై వచ్చిన ప్రస్తుత కమిషనర్ జె.నిర్మల్‌కుమార్‌ను తిరిగి మాతృశాఖకు పంపిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిర్మల్‌కుమార్ బాపట్ల కమిషనర్‌గా మూడు నెలలు మాత్రమే పని చేశారు.

వైద్య ఖర్చులకు సాయం

బాపట్ల, న్యూస్‌టుడే: బాపట్ల ఫార్మసీ కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని సన్మతి తండ్రి రమేష్‌కు మూత్రపిండాల మార్పిడి చికిత్స నిమిత్తం రూ.17, 232ల ఆర్థిక సాయం చెక్కును మానవతా స్వచ్ఛంద సంస్థ ఛైర్మన్ శరత్‌బోస్ ఆదివారం అందజేశారు. పట్టణంలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మానవతా సంస్థ ద్వారా పర్యావరణ పరిరక్షణ, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం, పేదల వైద్య ఖర్చులకు సాయం చేస్తున్నట్లు తెలిపారు.

ఉచిత శిబిరానికి స్పందన

కర్లపాలెం, న్యూస్‌టుడే: కర్లపాలెం శ్రీరామ కృష్ణ సేవాసమితిలో పేరలి నరసయ్య చారిటబుల్ ట్రస్టు, తిమ్మరాజు కృష్ణమూర్తి మెమోరియల్ ఆధ్వర్యంలో మధుమేహ వైద్యుడు చల్లా రామ్మోహనరావు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 100 మందికి వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73135, వేమూరు: 91107 837382

? వేమూరులోని ఎస్టీ కాలనీలో మురుగు నీరు పోవడానికి తూము లేకపోవడంతో నీరు రహదారిపై ప్రవహిస్తోంది. ఈ మార్గంలో నడిచేవారు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. **- స్థానికుడు, వేమూరు**

✔ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతాం.

- శేఖర్, ఈవోపీఆర్డీ. -న్యూస్‌టుడే, వేమూరు



లలితా త్రిపురసుందరి అలంకారంలో.. | నగరం ఉల్లిపాలెం గ్రామంలో | రేపల్లె ఓల్డ్‌టౌన్‌లో.. | బూరగలమ్మగుడిలో అన్నపూర్ణదేవిగా.. | కర్లపాలెం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో.. | యడ్లపల్లి సొసైటీ కూడలిలో.. | సంగుపాలెం కోడూరులో.. | నందిరాజు తోటలో.. | అమృతలూరులో.. | పేటేరులో..

9న సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం

చెరుకుపల్లి న్యూస్‌టుడే: చెరుకుపల్లి బాలకోటేశ్వరస్వామి ఆలయంలో 9న సరస్వతీ దేవి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్ర ఈ సందర్భంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి విరల్ శ్రీనివాస వర్మ తెలిపారు. గుళ్లపల్లి ఆనందేశ్వరస్వామి దేవాలయంలో కూడా ఇదే కార్యక్రమం ఉంటుందని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పొన్నపల్లి సత్యనారాయణ తెలిపారు.

నేడు చెరుకుపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

చెరుకుపల్లి న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ చెరుకుపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం (ఏఐఎఫ్‌టీయూ-న్యూ) నాయకుడు మరివాడ వెంకటరావు తెలిపారు. కార్మికులు పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

త్రిపుర సుందరీ మాతా.. మమ్మాశీర్వదించుమా

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు




అమ్మవారికి సామూహిక హారతి ఇస్తున్న మహిళలు



పాండురంగస్వామి ఆలయంలో అమ్మవారికి పూజలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. నాలుగోరోజైన ఆదివారం అమ్మవారు లలితా త్రిపుర సుందరి, అన్నపూర్ణమ్మ అలంకారాలలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు చోట్ల భక్తులు అమ్మవారి విగ్రహాలు ప్రతిష్ఠించి పూజలుగావించి ఆశీర్వాదాలు పొందారు. **-న్యూస్‌టుడే బృందం**



కోటిపల్లి దేవస్థానంలో.. | కూచినపూడిలో కనకదుర్గమ్మ విగ్రహం | రాజోలులో శ్రీమహా కాళికా దేవిగా.. | పోలేరమ్మ ఆలయంలో.. | బాపట్ల మూడో వార్డులో..

శ్రీశైలం భ్రమరాంబకు వద్ద కంకుల హారం



ఆలయ ఈవో పెద్దిరాజుకు వరి కంకుల గుచ్ఛం అందజేస్తున్న సుబ్బారావు, శివనాగేశ్వరమ్మ దంపతులు

బాపట్ల, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో భాగంగా శ్రీశైలం భ్రమరాంబిక దేవికి బాపట్లకు చెందిన కళాకారులు సింగంశెట్టి శివనాగేశ్వరమ్మ, సుబ్బారావు దంపతులు వడ్ల కంకుల హారం, స్వాగత తోరణాలను ఆలయ పాలనాధికారి పెద్దిరాజుకు ఆదివారం అందజేశారు. రెండు నెలలుగా శ్రీశైలంలో ఉంటూ తిరుపతి జిల్లా నాయుడుపేట నుంచి వరి కంకులు సేకరించి, స్వాగత తోరణాలు తయారు చేసి ఆలయాల్లో మల్లికార్జునస్వామి, భ్రమరాంబికా దేవికి అలంకరణ నిమిత్తం అందించారు.

చెరువు కట్టకు మరమ్మతులు చేయరూ!

మండలంలోని పోతుమర్రులో పంచాయతీ చెరువు కట్ట రోడ్డు కోతకు గురైంది. దీంతో ఈ మార్గంలో వెళ్లే వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. స్థానికులు చంపాడు వైపు పొలాలకు వెళ్లేందుకు ఈ కట్ట రోడ్డు దగ్గర మార్గం. వాస్తవానికి రైతులు పంట చేరవేతకు, ఎరువులు తరలించడానికి దీన్నే వినియోగిస్తారు. చెరువు కట్ట రహదారి కోతకు గురవడంతో బీసీ కాలనీ మీదుగా తిరిగి రావాల్సి వస్తుందని అన్నదాతలు చెబుతున్నారు. సంబంధిత అధికారులు చొరవతీసుకుని కోతపడిన రహదారికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ రాజ్ శాఖ ఏఈ మరియదాసును సంప్రదించగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తానని సమాధానం ఇచ్చారు. **-న్యూస్‌టుడే, వేమూరు**



పోతుమర్రులో కోతకు గురవుతున్న చెరువు కట్ట రోడ్డు

చీకట్లో సూర్యలంక బీచ్ రోడ్డు

ప్రముఖ పర్యాటక కేంద్రం సూర్యలంక బీచ్ రోడ్డులో వీధి దీపాలు వెలగక రాత్రుళ్లు చీకట్లు కమ్ముకున్నాయి. తీరానికి వేల మంది పర్యాటకులు వస్తున్నారు. రహదారులపై ఆవులు, గేదెలు రాత్రులు సంచరిస్తున్నాయి. చీకట్లో వాహనదారులకు పశువులు కనపడక ప్రమాదాలు సంభవించి గాయాల పాలవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి వెలగని వీధి దీపాల స్థానంలో కొత్త వాటిని వేయాలని స్థానికులు కోరుతున్నారు. డీఎల్‌పీవో శరత్‌బాబు దృష్టికి సమస్య తీసుకెళ్లగా కొత్త దీపాలు అమర్చి సమస్య పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఆదేశిస్తామని తెలిపారు. **- న్యూస్‌టుడే, బాపట్ల**



వీధి దీపాలు వెలగక రాత్రి చీకటిగా సూర్యలంక రోడ్డు

డొంక మార్గం బాగు చేయండి

మండలంలోని చావలిలో బీబీఆర్ అడ్డ రోడ్డు నుంచి కనగాల వెళ్లే డొంక రోడ్డు అధ్వానంగా మారింది. గత ఐదేళ్లలో ఈ దారి గురించి పట్టించుకున్న నాథుడు లేకపోవడంతో ఈ మార్గం గుంతలమయంగా మారింది. చావలి, పెరవలి, కనగాల రైతులు వ్యవసాయ పనులకు ఈ డొంకనే వినియోగిస్తారు. రైతులు ఈ మార్గం గుండా వెళ్లి వెయ్యి ఎకరాలు సాగు చేయాలి. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని ఈ మార్గాన్ని ధాన్యం పంట చేతికందే సమయానికి బాగుచేయాలని అన్నదాతలు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ రాజ్ శాఖ ఏఈ మరియదాసును వివరణ కోరగా సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళతామని తెలిపారు. **- న్యూస్‌టుడే, వేమూరు**



కనగాల వెళ్లే డొంకరోడ్డు పరిస్థితి ఇలా

నిధులు మంజూరు కాకుండానే నిర్మాణాలా?

గత ఎన్నికల నేపథ్యంలో వైకాపా నేతలు ఓట్లు దండుకోవడానికి మండల కేంద్రంలో ఏకలవ్యుని విగ్రహం ఎదురు వీధిని నిధులు మంజూరు కాకుండానే సిమెంటు రహదారిగా అభివృద్ధి చేస్తున్నట్లు తామే రహదారి నిర్మిస్తున్నట్లు ఎన్నికల్లో వైకాపా అభ్యర్థిని గెలిపించాలని అప్పట్లో ప్రచారం చేశారు. అంతటితో ఊరుకోకుండా నిర్మాణాలకు అవసరం అయిన కీవాల్సు నిర్మించారు. నెలలు గడచినా పనులు చేయక పోవడంతో రాత్రుళ్లు వాటిపై పడి పలువురు గాయాల పాలవుతున్నారు. వైకాపా నేతలు తమను మభ్య పెట్టారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నూతన ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈ చక్రవర్తి వద్ద ప్రస్తావించగా నిధులు మంజూరు కాకుండానే ఉపాధిహామీ పథకంలో నిర్మాణాలు చేయాలని పంచాయతీ నుంచి పనులకు అవసరం అయిన కీవాల్సు నిర్మించారని తెలిపారు. పంచాయతీ ప్రతిపాదించిన నిధులు నేటికి మంజూరు కాలేదని ఆయన తెలిపారు. **- న్యూస్‌టుడే, నిజాంపట్నం**



కీవాల్సు నిర్మించిన దృశ్యం

జిల్లా కేంద్రం.. అంతర్గత రహదారులు అధ్వానం

✦ వరద ప్రభావిత జిల్లాగా ప్రభుత్వం ప్రకటన

✦ ప్రతిపాదనలు పంపిస్తే విపత్తుల నిర్వహణ నిధులు విడుదల

బాపట్ల, న్యూస్‌టుడే

బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బాపట్ల పురపాలక సంఘంలో సిమెంటు రహదారులు దెబ్బతిన్నాయి. 15 నుంచి 20 ఏళ్ల క్రితం నిర్మించిన రోడ్లపై గోతులు ఏర్పడ్డాయి. పలుచోట్ల రహదారులు కుంగిపోయాయి. జిల్లాను ప్రభుత్వం వరద ప్రభావిత జిల్లాగా ప్రకటించింది. విపత్తు నిర్వహణ నిధులతో రహదారులకు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది.

☛ 34 వార్డులున్న పురపాలికలో 78 కి.మీ. పొడవున సిమెంటు రోడ్లు ఉన్నాయి. అందులో 30 శాతానికి పైగా పాత రోడ్లే. గత నెల 30, 31న భారీ వర్షాలు కురవడంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతమైన వెన్నలకంటి నగర్, శారదాపురి కాలనీలు జల దిగ్బంధం చిక్కుకోకుండా సిమెంటు రహదారులను జేసీబీతో పగలగొట్టి నీటిని అధికారులు బయటకు పంపించారు. పగులగొట్టిన రోడ్ల స్థానంలో కొత్తగా నిర్మించాల్సి ఉంది.



తవ్వకాలువ వద్ద..

☛ విజయలక్ష్మీపురంలో రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన రోడ్లు కుంగిపోయాయి. గోతులు ఏర్పడ్డాయి. మూడో వార్డు రాజీవ్ గాంధీ కాలనీ, ఎస్టీ కాలనీ చుట్టూ చేరిన నీటిని బయటకు పంపించడానికి సిమెంటు రోడ్డు పగలగొట్టారు. బేతనీ కాలనీ, గంగపుత్ర కాలనీ సిమెంటు రోడ్డు మొత్తం గోతులమయంగా మారింది. గులాం హుస్సేన్‌తోట మార్గంలో రోడ్డు పలుచోట్ల పగిలి ముక్కలైంది.

☛ పట్టణంలోని తవ్వ కాలువ నుంచి శృంగారపురం, ఉమ్మారెడ్డి సరోజనీ దేవి కాలనీ, మున్నంవారిపాలెం మార్గంలో రోడ్డు పగిలిపోయింది. కారుమూరి హనుమంతరావు నగర్ కాలనీ రహదారి గోతుల మయంగా మారింది. ఉప్పరపాలెం రైల్వేగేటు నుంచి ఇందిరా గాంధీ బొమ్మ కూడలి, జమేదారు పేట, రెడ్డిపాలెం వరకు రోడ్డు దెబ్బతింది. పలు చోట్ల కొత్తగా రోడ్లు నిర్మించాల్సి ఉండగా.. కొన్ని చోట్ల గుంతలు పూడ్చి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



విజయలక్ష్మీపురంలో దెబ్బతిన్న సిమెంటు రోడ్డు

ప్రతిపాదనలు పంపాం

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సిమెంటు రహదారులు సైతం దెబ్బతిన్నాయి. పలుచోట్ల రోడ్లను పగలగొట్టాల్సి వచ్చింది. రహదారుల నిర్మాణం, మరమ్మతుల కోసం ప్రతిపాదనలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపాం. నిధులు మంజూరు కాగానే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం. **- శ్రీనివాసులు, పురపాలక డీఈ**

ప్రణాళికాబద్ధంగా సాధన చేస్తే విజయం



మాట్లాడుతున్న డివిజనల్ సహకార శాఖాధికారి యలమందరావు

బాపట్ల, న్యూస్‌టుడే: పోటీ పరీక్షల్లో అభ్యర్థులు ప్రణాళికాబద్ధంగా కష్టపడి సాధన చేస్తే విజయం లభిస్తుందని కావలి డివిజనల్ సహకార శాఖాధికారి కాకి యలమందరావు అన్నారు. పట్టణంలోని అన్నం సతీష్ కాపు కల్యాణ మండపంలో బాపట్ల కాపు ఉపాధ్యాయ, ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవగాహన తరగతులు ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరీక్షలు సిద్ధమయ్యే వారు భయాన్ని వీడి ఆత్మవిశ్వాసంతో సాధన చేయాలన్నారు. కాపు సేవా సంఘం అధ్యక్షుడు ఇక్కుర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ కాపు సేవా సంఘం ద్వారా మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ సహకారంతో కాపు విద్యార్థులకు ఏటా రూ.15 లక్షల ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు తెలిపారు.

నేత్రదానంతో మరొకరికి చూపు

కనగాల (చెరుకుపల్లి గ్రామీణ) : నేత్రదానంతో మరొకరికి చూపు అందించవచ్చని కనగాల హాజీ మహ్మద్ ఖాసీమ్ సాహెబ్, మహమ్మద్ గాలబ్ సాహెబ్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కళాశాల కరస్పాండెంట్ అబ్దుల్ సమ్మద్ అన్నారు. హాజీ షేక్ హసన్ అహ్మద్, హాజి షేర్ మహమ్మద్ అల్లావుద్దీన్ స్మారక ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆదివారం కళాశాలలో ప్రారంభించారు. పెదకాకాని శంకర కంటి వైద్యశాల, జిల్లా అంధత్వ నివారణ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2001 నుంచి ఏటా ఉచిత కంటి వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. వచ్చే ఏడాది 25ఏళ్లు పూర్తిచేసుకుంటున్నామని, ఏడాది పొడవున నేత్రదానంపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేలా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



వృద్ధుడిని పరీక్షిస్తున్న వైద్యనిపుణురాలు ఫారుఖ్, చిత్రంలో సమ్మద్

9 వరకు టెండర్లు వేయడానికి అవకాశం

వేమూరు, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల లైసెన్సుల కోసం టెండర్లు సమర్పించే వారికి 9వ తేది వరకు అవకాశం ఉందని అబ్కారీ శాఖ సీఐ రవి తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 17 దుకాణాలు ఉండగా, వేమూరు మండలంలోని 87, 88, 89 మూడు దుకాణాలకు మాత్రం తొమ్మిది మంది టెండర్లు వేసినట్లు వివరించారు. మిగతా 14 దుకాణాలకు సంబంధించి ఆఫ్‌లైన్‌లో కానీ, ఆన్‌లైన్‌లో కానీ ఇంతవరకు ఒక్క టెండరు రాలేదని చెప్పారు.

భాజపా సభ్యత్వ నమోదు

రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే: రేపల్లె ఓల్డ్‌టౌన్‌లో భాజపా మహా సభ్యత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సభ్యత్వ నమోదు శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. భాజపా సభ్యులుగా చేరి దేశ సమైక్యత, సమగ్రతకు తోడ్పాటు అందించాలని కోరారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో వైకాపా కార్యకర్తలకు అండగా ఉంటామని వైకాపా జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున అన్నారు. ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీలు అమలు చేయటంలో తెదేపా కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. దాడులు, కేసులతో వైకాపా నాయకులు, శ్రేణులను ప్రభుత్వం భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలన్నారు. వైకాపా నేతలు ఎర్రయ్య, రాఘవరెడ్డి, డేవిడ్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

రేపల్లెలో నీటి వృథాపై దృష్టేది?

రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే

నీటి వృథా అరికడదాం.. పొదుపు పాటిద్దాం అని చెప్పే అధికారుల మాటలు క్షేత్రస్థాయిలో ఆచరణకు నోచుకోవడం లేదు. రేపల్లె పురపాలక సంఘం పరిధిలో నిత్యం వేల లీటర్ల నీరు మురుగు పాలవుతున్నా పటిష్ఠ చర్యలు చేపట్టడం లేదు. లీకైన ప్రాంతాలను గుర్తించి వాటికి మరమ్మతులు చేయించేందుకు కనీసం వారం రోజులు పడుతోంది. అప్పటి వరకు నీరు వృథాగా నేలపాలవుతోంది. పటిష్ఠ చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఏడాదికి పైగా పద్మశాలీయ కల్యాణ మండపం, ఏడో వార్డులో ప్రధాన పైపులైన్లకు లీకు ఏర్పడితే మరమ్మతులు చేయలేమని అధికారులు వదిలేయడం శోచనీయమని ప్రజాసంఘాలు విమర్శిస్తున్నాయి.

★ పట్టణ శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా కావడంలేదు. నిబంధనల మేరకు నీరు ప్రజలకు అందడం లేదు. ఒకటో వార్డు ఎస్టీ కాలనీ, 28వ వార్డు పేటేరు వెళ్లే మార్గంలో రెండ్రోజులకోసారి ట్యాంకరు పంపి తాగు నీరు అందిస్తున్నారు. పట్టణ పరిధిలో పబ్లిక్ కుళాయిలకు బిరడాలేక నేలపాలవుతోంది. లీకైన ప్రాంతాల నుంచి సరఫరా అవుతున్న నీరు మురికిగా వస్తున్నాయి. వాటిని తాగితే అనారోగ్యం బారిన పడతామని స్థానికులు భయపడుతున్నారు. ఇప్పటికైనా నేతలు, అధికారులు స్పందించి తాగునీటి వృథాపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై ఏఈ రోహిణి మాట్లాడుతూ పైపులైనుకు లీకు పడిన వెంటనే సిబ్బందితో మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. అమృత్ 2.0 పథకం ద్వారా రూ.26 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. టెండర్ల ప్రకియ పూర్తయిన వెంటనే కొత్త పైపు లైన్ల ఏర్పాటు చేయించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆమె తెలిపారు.



పాతపట్టణంలో బిరడాలేని కుళాయి వద్ద ఇలా



పైపులైను లీకై మురుగుకాల్వలోకి పోతున్న తాగునీరు

రేపల్లె పట్టణ జనాభా
65,000
వార్డులు: 28
తాగునీటి చెరువు: 1
ట్యాంకులు: 2
రోజూ సరఫరా అయ్యే నీరు 5 మిలియన్ లీటర్లు
వ్యక్తికి అందించాల్సింది 135 లీటర్లు
అందుతున్నది 85 లీటర్లు

వేర్వేరు ప్రమాదాల్లో అయిదుగురికి గాయాలు

క్రైమ్ కార్నర్

చందోలు(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే : చందోలు జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో ఆటో, ఆర్టీసీ బస్సు ఢీ కొనటంతో ఇద్దరు గాయపడ్డారు. చందోలు ఎస్సై శ్రీనివాస్ వివరాల మేరకు.. ఆదివారం పొన్నూరులో శుభ కార్యక్రమానికి చందోలు నుంచి భోజనాలు తీసుకు వెళ్తున్న ఆటోను రేపల్లె నుంచి గుంటూరు వెళ్తున్న బస్సు పాఠశాల వద్ద బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆటో రహదారిపై బోల్తా పడింది. ఆటో డ్రైవర్ సుభాని, మరో వ్యక్తి గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో పొన్నూరు వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : కారు ఢీకొనటంతో ద్విచక్రవానదారుడికి గాయాలైన సంఘటన బాపట్ల పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుడు బాపట్ల ప్రాంతీయ వైద్యశాల ఔట్ పోలీస్‌స్టేషన్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. జిల్లా పబ్లిక్ హెల్త్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పెద్దినేని కుమారస్వామి స్థానిక భీమావారిపాలెంలో నివాసముంటున్నాడు. ఆదివారం ద్విచక్రవాహనంపై గడియారస్తంభం నుంచి పాత బస్టాండ్ మీదుగా ఇంటికి వెళ్తుండగా స్థానిక కన్యకా పరమేశ్వరి దేవస్థానం సమీపంలో చీలురోడ్డు వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కుమారస్వామికి గాయాలయ్యాయి. కారు డ్రైవర్ మద్యం తాగి ఉన్నట్లు గుర్తించామని, కారు సీజ్ చేయటంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవింగ్ క్రింద డ్రైవరుపై కేసు నమోదు చేస్తామని పట్టణ సీఐ ఆర్.అహ్మద్‌జానీ తెలిపారు.

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : ప్రమాదవశాత్తూ ద్విచక్రవాహనం అదుపు తప్పి ఇద్దరు యువకులకు గాయాలైన ఘటన ఆదివారం రాత్రి మండల పరిధిలోని సూర్యలంక రోడ్డులో గల ముత్తాయపాలెం గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. కాకుమాను గ్రామానికి చెందిన సుధీర్, సుభానీలు ఆదివారం సెలవు దినం కావటంతో సరదాగా గడిపేందుకు సూర్యలంక తీరానికి వచ్చి తిరుగు పయనమైయ్యారు. ఈ నేపథ్యంలో ముత్తాయపాలెం గ్రామ సమీపంలో శునకం వాహనానికి ఎదురు రావటంతో జారీ కింద పడ్డారు. గాయాలపాలైన సుభానీ, సుధీర్‌లను చికిత్స నిమిత్తం ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు.

ధర్నా విజయవంతం చేయండి

భట్టిప్రోలు న్యూస్‌టుడే: అధిక వర్షాల వల్ల ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులకు ప్రభుత్వం పరిహారం అందించాలని రాష్ట్ర చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని రాష్ట్ర సహాయక కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ అన్నారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ మంగళగిరిలో ప్రభుత్వం అందించిన పరిహారాన్ని భట్టిప్రోలులోనూ అందించాలని కోరారు.

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

ఘనంగా శ్రీనివాసుని కల్యాణం

చీరాల అర్బన్, వేటపాలెం న్యూస్‌టుడే: దసరాను పురస్కరించుకుని బతుకమ్మ ఉత్సవ సేవా సంఘం ఆధ్వర్యంలో 65వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక ఎన్‌వీఎస్ అండ్ ఎస్‌జేఆర్ కల్యాణ మండపంలో ఆదివారం శ్రీనివాసుని కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈక్రతువులో 60 మంది దంపతులు పాల్గొన్నారు.



శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కేంద్ర మంత్రిని కలసిన ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదివారం కలిశారు. మంత్రి పెమ్మసానికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి పర్చూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకశ్రద్ధ చూపాలని కోరినట్లు ఏలూరి క్యాంపు కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఆయన వెంట తెదేపా నేత మానం హరిబాబు ఉన్నారు.



మంత్రి పెమ్మసానికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏలూరి

సెంటు వరి నారు రూ.2 వేలు

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాంలో సెంటు వరి నారు ధర రూ.2 వేలు పలుకుతోంది. ఇసుక భూముల్లో ఎన్‌ఎల్ఆర్ 33892 రకం వరి నారు పెంపకాన్ని రైతులు ఎక్కువగా చేట్టారు. పెదగంజాం, సోపిరాల, కడవకుదురు, పూలవారిపాలెం తదితర గ్రామాల్లో నారు వేయగా, కొందరు ప్రత్యేకంగా అమ్ముకునేందుకు పెంచుతున్నారు. విద్యుత్తు మోటార్ల కింద నాట్లు వేసేందుకు మాగాణి భూములను ట్రాక్టర్లతో దుక్కిలు దున్ని సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోని ఉత్తర ప్రాంతంలో ఇటీవల కురిసిన వర్షాలకు నారుమడులు దెబ్బతిన్నాయి. ఇప్పుడు అక్కడ సిద్ధం చేసిన మాగాణి భూముల్లో నాటేందుకు నారులేక రైతులు చినగంజాం ప్రాంతం వస్తున్నారు. కొందరు కొని తీసుకెళుతుండగా మరికొందరు బయానా ఇచ్చి వెళుతున్నారు. చినగంజాం మండల పరిధిలో తూర్పు వైపున ఉండే చేద్దోడు చేను, పైచేను, వాక పొలాల్లో ఈ నెలాఖరుకు నాట్లు వేస్తామని అందుకోసం నారు మడులను ఇసుక భూముల్లోనే చేపట్టామని రైతులు వెంకటేశ్వర్లు, సుబ్బయ్య, శ్రీనివాసరావు తెలిపారు.



ఇసుక భూముల్లో విద్యుత్తు మోటార్ల కింద వరి నారుమడుల పెంపకం

రహదారిపై ఆవులు... వాహనదారుల బెంబేలు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: చీరాల - ఒంగోలు రహదారిలో చీకటి పడితే చాలు ఆవులు రోడ్డుపైకి చేరుతున్నాయి. ప్రధానంగా వేటపాలెం మండలం రామానగర్, దేశాయిపేట, జాండ్రపేట, పాత చీరాల ప్రసాదు థియేటరు, ఫైర్ స్టేషన్ ప్రాంతాల్లో వీటి సంచారం అధికంగా ఉంటోంది. ఈ సమయంలో వాహనదారులు వీటిని దాటుకుని వెళ్లాలంటే బెంబేలెత్తుతున్నారు. వాహనాల హారన్ మోతకు ఎక్కడ ఇవి పరుగు పెడతాయేనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం దేశాయిపేట వద్ద నడిచివెళుతున్న ఒకర్ని ఆవు వెంటపడి మరీ పొడిచింది. ఇదే సమయంలో రోడ్డుపై నడిచివెళుతున్న మరో నలుగుర్ని ఇలాగే వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలు అనేకం ఉన్నాయి. వీటిని కట్టడి చేసేందుకు గతనెలలో జరిగిన మున్సిపల్ అత్యవసర సమావేశంలో చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇప్పటికి వీటి నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తమ ప్రాంతాల్లో రహదారులపై సేదతీరున్న ఆవుల యజమానులను గుర్తించి, వీటిని ఇంటి వద్దనే కట్టివేసేలా చర్యలు చేపట్టాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



చీరాల-ఒంగోలు రహదారిపై పాతచీరాల వద్ద గోవులు

ధేనువకొండ చెరువులో కలపపై కన్ను

ధేనువకొండ (అద్దంకి), న్యూస్‌టుడే: ధేనువకొండ చెరువులో ఏపుగా పెరిగిన చిల్ల కంపపై స్థానిక నేతల కన్ను పడింది. ఎలాగైనా చెట్లను తొలగించి అమ్ముకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఐదేళ్ల నుంచి చెరువుగర్భంలో పెరిగిన తుమ్మచెట్లు తొలగించేందుకు ఎవరూ సాహసించలేదు. ప్రస్తుతం వీటి టన్ను ఖరీదు రూ.4,800 వరకు గిట్టుబాటు అవుతుంది. మొత్తం 260 ఎకరాల చెరువు విస్తీర్ణంలో పెరిగిన చిల్లచెట్లను కొట్టి అమ్మితే సుమారు రూ.7-8 లక్షల వరకు సమకూరే అవకాశం ఉంది. ఇటీవల కొందరు స్థానిక నేతలు చిల్లచెట్లను కొట్టి, తరలించేందుకు ప్రయత్నించారు. లారీల్లో కొంతమేర తీసుకెళ్లారు. దీంతో మిగిలినవారు తమ వంతుగా ఉపక్రమించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి ఆ చర్యల్ని అడ్డుకున్నారు. నీటిపారుదల శాఖ చెరువులో చెట్లను తొలగించాలంటే అనుమతులు ఉండాలని వెల్లడించడంతో నేతలు తెల్లముఖం వేశారు. ఈవిషయమై నీటిపారుదల శాఖ ఏఈ ఎం.మధుసూదన్‌ను వివరణ కోరగా చిల్లచెట్ల తొలగింపు విషయమై పోలీసులకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.



ధేనువకొండ చెరువులో పెరిగిన చిల్లచెట్లు



కొట్టేసిన తుమ్మచెట్లు

పల్లెలకు నేత్ర వైద్య సేవల చేరువే ఏలూరి లక్ష్యం

మార్టూరు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన కంటి సంబంధిత వైద్య సేవలు చేరువ చేయాలనే సంకల్పంతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని తెదేపా పార్లమెంటు ఉపాధ్యక్షుడు తొండెపు ఆదినారాయణ, ఆ పార్టీ సీనియర్ నేత కామేపల్లి హరిబాబు అన్నారు. మండలంలోని జనకవరం ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, శంకర్ కంటి ఆసుపత్రి, నోవా అగ్రోస్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన రోగులకు వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించారు. దీనిలో 793 మంది హాజరుకాగా, 130 మందికి అవసరమైన కంటి శస్త్రచికిత్సలను పెదకాకాని ఆసుపత్రిలో ఉచితంగా, క్రమపద్ధతిలో నిర్వహిస్తామని నిర్వాహకులు వెల్లడించారు. తెదేపా నాయకులు తాటి నాగేశ్వరరావు, కామినేని జనార్దన్, తేలప్రోలు సాంబయ్య, అడుసుమల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్, నాగేశ్వరరావు చిత్రపటాలకు నివాళులర్పించి శిబిరాన్ని ప్రారంభించిన తెదేపా నేతలు తొండెపు, కామేపల్లి తదితరులు

గ్రామ కార్యదర్శులకు స్థానచలనం

చీరాల (గ్రామీణం), న్యూస్‌టుడే: చీరాల మండల పరిధిలో పలువురు గ్రామ కార్యదర్శులు బదిలీ అయ్యారు. ఈపూరుపాలెం కార్యదర్శిగా పనిచేస్తున్న టి.వెంకటేశ్వరరావును వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీలో నియమించారు. దేవాంగపురి గ్రామ కార్యదర్శి మురళీ బాపూజీని ఈపూరుపాలెంలో నియమిస్తూ ఉత్తర్వులు విడుదల అయ్యాయి. వాడరేవు కార్యదర్శి సుబ్బారెడ్డి ఇంకొల్లు బదిలీ అయ్యారు. తోటవారిపాలెం కార్యదర్శి ఇర్ఫాన్ ప్రకాశం జిల్లా చదలవాడ, బుర్లవారిపాలెం కార్యదర్శి ఫాతిమా ఇంకొల్లు మండలం పావులూరు బదిలీ అయ్యారు. వ్యక్తిగతంగా ఉత్తర్వులు పొందిన వీరు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో రిలీవ్ కానున్నారు. ఇంకొల్లు నుంచి కోట నాగయ్య వాడరేవు, చల్లారెడ్డిపాలేనికి చెందిన శివలీల బుర్లవారిపాలెం కార్యదర్శులుగా ఉత్తర్వులు పొందినట్లు సమాచారం.



ప్రత్యేక అలంకరణలో ద్రోణదుల అంకాలమ్మ తల్లి



పేరాల జక్కావారి వీధిలో శ్రీలలిత పరమేశ్వరిగా..



పేరాల శివాలయంలో శాకాంబరిగా..



అద్దంకి: హిమవంతిని దేవిగా.. కన్యకాపరమేశ్వరి



అద్దంకి: మీనాక్షీదేవిగా.. అనమాలక్ష్మి



ఇంకొల్లులో లలితాత్రిపురసుందరిగా.. దుర్గామాత

దివ్య స్వరూపిణి.. లలిత త్రిపుర సుందరి

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లోని వివిధ ఆలయాల్లో అమ్మవారు లలిత త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. పలు చోట్ల భక్తులు కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారి ఆలయాలు విద్యుత్తు దీపకాంతుల్లో వెలుగులీనుతున్నాయి.

-న్యూస్‌టుడే బృందం



మార్టూరు: నాగరాజుపల్లిలో లలితాదేవి అలంకరణలో పార్వతీ మాత



కారంచేడు: వైష్ణవి దుర్గామాత ఆలయంలో అన్నపూర్ణాదేవిగా



పర్చూరు: కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



చినగంజాం ఆలయంలో అంకమ్మ తల్లి అలంకరణలో..



సోపిరాల శివాలయంలో శ్రీలలితా పరమేశ్వరీదేవిగా

నిమజ్జన విగ్రహాలే ఆదాయ వనరు



ఏల్చూరు చెరువులో నిమజ్జనం చేసిన వినాయక విగ్రహం నుంచి ఇనుప చట్రాలు వెలికితీస్తున్న యువకులు

ఏల్చూరు (సంతమాగులూరు), న్యూస్‌టుడే: నిమజ్జనం చేసిన విగ్రహాలనే ఆదాయ వనరుగా మార్చుకున్నారు.. ఆ యువకులు. భారీ వినాయక విగ్రహాల తయారీలో ఉపయోగించిన ఇనుప చట్రాన్ని వెలికితీస్తే 40 కేజీల పాత ఇనుము లభిస్తోంది. దాన్ని కిలో రూ.30 లెక్కన అమ్మితే రూ.1,200 ఆదాయం చేతికి అందుతోంది. పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలానికి చెందిన సాయి, బావోజీ అందుకోసం గండాన్ని పట్టించుకోకుండా ఏల్చూరు చెరువులో నిమజ్జనం చేసిన భారీ విగ్రహంపై నిలబడి మలాటు, కత్తితో దాన్ని ధ్వంసం చేసి ఇనుమును బయటకు తీసేందుకు పడిన ప్రయాస ఇది. ఎక్కడ చెరువుల్లో నిమజ్జన విగ్రహాలు కనిపించినా ఇలా ఇనుమును సేకరిస్తూ దాని ద్వారా జీవనోపాధి పొందుతున్నారు.

ప్రజల ప్రయత్నం.. సత్ఫలితం

ప్రభుత్వ భూమిలో కుంట ఏర్పాటుతో నిలిచిన నీరు

ప్రభుత్వ భూమిలో చెక్‌డ్యాం నిర్మాణం సత్ఫలితాలనిస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జనకవరం గ్రామానికి చెందిన వారంతా ఏకతాటిపై నిలిచారు. జనకవరం-పంగులూరు రహదారి అంచులో ఉన్న ఏడెకరాల ప్రభుత్వ భూమిలో నీటి నిల్వ కుంటల ఏర్పాటుకు సంకల్పించారు. నెల రోజుల కిందట తొలి ప్రయత్నంగా నాలుగు ఎకరాల్లో పూడికతీసి, గట్లను పటిష్ఠం చేశారు. ఈవిధంగా రెండు కుంటలు ఏర్పాటయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ కుంటల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. పొలాలకు వెళ్లిన గేదెలు, గొర్రెలు, మేకలకు వీటిలోని నీరు ఉపకరిస్తాయని తెలుగు యువత నేత గుర్రం ఆదిశేఖర్ తెలిపారు. మరో మూడెకరాల్లో పూడిక తీసి, నీటి నిల్వ కుంటలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

-న్యూస్‌టుడే, జనకవరం (జే పంగులూరు)



రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



మార్టూరు యూనిట్ క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

మార్టూరు, న్యూస్‌టుడే: యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని గుంటూరులో నిర్వహించిన క్రీడల్లో మార్టూరు యూనిట్ నుంచి జిల్లాకు ప్రాతినిధ్యం వహించిన ఉపాధ్యాయులు ఉత్తమ ప్రతిభచూపి, రాష్ట్రస్థాయి బహుమతులు అందుకున్నారు. ఆమేరకు ఆదివారం యూటీఎఫ్ మార్టూరు యూనిట్ ప్రతినిధులు వివరాలు వెల్లడించారు. క్యారమ్స్, జావెలిన్ త్రో తదితర అంశాల్లో గెలుపొందారని చెప్పారు. విజేతలకు ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఆ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు బహుమతులు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో బి.ఆదినారాయణ, పి.సునీల్ కుమార్, కె.రవిబాబు, పి.రామాంజనేయులు, ఎస్.వెంకట సుబ్బయ్య, బి.ప్రతాప్, ఎం.ఈశ్వరప్రసాద్, సూర్యప్రకాశ్, యోహోషువా, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటా

చీరాల, న్యూస్‌టుడే: రైతులకు ఏకష్టం వచ్చినా తాను అండగా ఉండి పరిష్కరిస్తానని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. మోటుపల్లి ఎత్తిపోతల పథకానికి సంబంధించి నీటిని ఆదివారం ఎమ్మెల్యే విడుదల చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన మోటార్ల మరమ్మతులు పూర్తిచేసి నీరు అందిస్తున్నామని తెలిపారు. చప్పిడి వెంకటరావు, బి.సోమయ్య, పెరుగు భాస్కరరావు, పి.రాములు, శ్రీనివాసరావు, మీసాల అంకిరెడ్డి, రామచంద్రరావు, సుబ్బారెడ్డి, గొర్ల రాముడు, కీర్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మీట నొక్కి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

22 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

మేదరమెట్ల, న్యూస్‌టుడే: మేదరమెట్ల నుంచి అద్దంకికి అక్రమంగా ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మేదరమెట్ల పోలీసులు శనివారం అర్ధరాత్రి పట్టుకున్నారు. ఎస్సై మహమ్మద్ రఫీ తెలిపిన వివరాల ప్రకారం.. మేదరమెట్లలోని దైవాలరావూరు రోడ్డు సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో రేషన్ బియ్యంతో వెళ్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. అందులో 22 బస్తాల పీడీఎస్ బియ్యం దొరికాయి. వాటిని తరలిస్తున్న అద్దంకికి చెందిన నరాల శ్రీకరుణ సారథి, ఒబ్బినేడి వీరాంజి, మేదరమెట్లకు చెందిన ఇడుపాలపాటి శ్రీనివాస్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. బియ్యాన్ని సమీపంలోని రేషన్ దుకాణానికి తరలించినట్లు తెలిపారు.

రంగా విగ్రహంపై శిల్పితో చర్చ

సోపిరాల (చినగంజాం), న్యూస్‌టుడే: సోపిరాల ప్రజల సమక్షంలో మాజీ ఎమ్మెల్యే, కాపు సంఘ నేత, దివంగత వంగవీటి మోహనరంగారావు కాంస్య విగ్రహం ఏర్పాటుపై అమలాపురం శిల్పి పెద్దిరెడ్డి రవీంద్రతో గ్రామ పెద్ద డాక్టర్ టీఎస్ఆర్ ఆంజనేయులు ఆదివారం స్థలం వద్ద చర్చించారు. రంగా విగ్రహం డిజైన్.. తదితర అంశాలపై మాట్లాడారు. స్థల ఏర్పాటు విషయంలో సహకరించిన పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో చర్చించి, ఇచ్చే తేదీ ఆధారంగా త్వరలో ఆయన చేతుల మీదుగా శంకుస్థాపన పనులు చేపట్టి పూర్తి చేసుకుందామని ఆంజనేయులు పేర్కొన్నారు. గ్రామ పెద్దలు, ప్రజలు సంయుక్తంగా రూ.25 లక్షలతో రంగా కాంస్య విగ్రహం, బస్‌షెల్టర్ నిర్మాణానికి ముందుకు రావడం అభినందనీయమని ఆంజనేయులు గ్రామస్థులను అభినందించారు.



శిల్పి రవీంద్రతో విగ్రహం ఏర్పాటుపై మాట్లాడుతున్న గ్రామపెద్ద ఆంజనేయులు, సోపిరాల వాసులు

లలిత సహస్ర నామం.. సర్వపాప హరణం

అద్దంకి, న్యూస్‌టుడే: లలిత సహస్ర నామార్చన కారణంగా సర్వపాపాలు హరిస్తాయని ఆధ్యాత్మికవేత్త వి.రమాసుందరి అన్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీచక్ర సహిత వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం ఎదుట ఆదివారం సాయంత్రం ఈ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం నాలుగు నుంచి రాత్రి ఆరు గంటల వరకు ఇది కొనసాగింది. 540 మంది ఆర్యవైశ్య మహిళలు భాగస్వాములయ్యారు. ఆరురకాల దుస్తులతో బతుకమ్మను తయారు చేసి కదంబాన్ని భక్తులకు అందించారు. పసుపురంగులో బతుకమ్మను తయారు చేయగానే అమ్మవారే స్వయంగా సాక్షాత్కరించిన భావన భక్తుల్లో కలిగినట్లు రమాసుందరి వివరించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ పూటుకూరి రామకోటేశ్వరరావు, పాలకమండలి సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. వనితాక్లబ్ పూర్వపు గవర్నర్ పూటుకూరి ఉమాఅన్నపూర్ణ, అద్దేపల్లి ప్రసన్న వేదికపై ఆశీనులయ్యారు.



పారాయణం జరిపిస్తున్న ఆధ్యాత్మిక సాధకురాలు రమాసుందరి



హాజరైన భక్తులు, పర్యవేక్షిస్తున్న ఆలయ కమిటీ ఛైర్మన్ రామకోటేశ్వరరావు

సమాజ మార్పులో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

అద్దంకి, న్యూస్‌టుడే: సమాజ మార్పులో ఉపాధ్యాయుల పాత్ర కీలకం అని విశ్రాంత ఆర్‌జేడీ డాక్టర్ యు.దేవపాలన అన్నారు. అద్దంకి మారం వారి సేవాసదన్‌లో ఆదివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. పుట్టంరాజు బుల్లెయ్య-రామలక్ష్మమ్మ, మైనంపాటి వీరరాఘవశర్మ మెమోరియల్ ట్రస్టుల ఆధ్వర్యంలో ఇది చేపట్టారు. సభకు వారణాశి రఘురామశర్మ అధ్యక్షత వహించారు. ట్రస్టుల తరఫున పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, డాక్టర్ తవనం వెంకట్రావు మాట్లాడారు. అనంతరం వేములకొండ హనుమంతరావు, గుడిపూడి అంజయ్య, యర్రమోతు వీరాస్వామి, నిమ్మరాజు నాగేశ్వరరావులను సత్కరించి, జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో చప్పిడి వీరయ్య, జమ్ములమడక హనుమంతరావు, మంచికలపాటి రాధాకృష్ణమూర్తి, ఆర్‌వీ.రాఘవరావు, మలాది శ్రీనివాసరావు, చుండూరి మురళీసుధాకర్, మహమ్మద్ రఫీ, భువనేశ్వరి, మిట్టా కామేశ్వరశర్మ, పీసీహెచ్.కోటయ్య, కూరపాటి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.



సత్కారం అందుకున్న విశ్రాంత ఉపాధ్యాయులు

నేడు అద్దంకికి మంత్రి

అద్దంకి,న్యూస్‌టుడే: రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం అద్దంకి రానున్నారు. వాసవీ కన్యాకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద జరిగే పూజల్లో పాల్గొననున్నారు.

విద్యార్థులకు చేతిరాత పోటీలు

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి శాఖా గ్రంథాలయం వద్ద చదవడం మాకిష్టంలో భాగంగా ఆదివారం చేతిరాత పోటీలు నిర్వహించారు. గ్రంథపాలకులు చుండూరి సుగుణారావు నేతృత్వంలో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలను ప్రకటించగా విద్వాన్ జ్యోతి చంద్రమౌళి బహుమతులు అందించారు. విశ్రాంత ఆర్‌జేడీ డాక్టర్ యు.దేవపాలన, ఎ.ప్రసాద్, జి.రమేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం పురాతన శ్రీభూసమేత భావనారాయణస్వామి 17వ వార్షికోత్సవంలో భాగంగా నాల్గో రోజైన ఆదివారం పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక హోమాలు, సాయంత్రం గజవాహనంపై శ్రీవారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

ఆపద్బంధువు గోరంట్ల

అద్దంకి, న్యూస్‌టుడే: విశ్రాంత అధ్యాపకులు దివంగత గోరంట్ల లక్ష్మీనారాయణ అందరికీ ఆపద్బంధువు అని వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు అన్నారు. ఇటీవల మృతిచెందిన లక్ష్మీనారాయణ దశదిన కర్మ అద్దంకి నాగులపాడు రోడ్డులోని ఆయన స్వగృహంలో ఆదివారం జరిగింది. సంస్మరణ సభలో ఆయన చిత్రపటానికి పలువురు నివాళులు అర్పించారు. చక్రాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవీ.శ్రీనివాసరావు, జ్యోతి చంద్రమౌళి, జే బాబూరావు, సర్వేశ్వరరావు, పీఎల్‌వీ.నరసింహారావు, అంజాద్‌బాషా పాల్గొన్నారు.

చురుగ్గా పూడిక తొలగింపు

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి పురపాలక సంఘం పరిధిలోని మురుగు కాలువల్లో పూడిక తొలగింపు ప్రక్రియ ప్రహసనంగా మారింది. వాణిజ్య కేంద్రంగా ఉన్న అద్దంకిలో పొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి మాధవస్వామి విగ్రహం వరకు రహదారికి ఇరువైపులా దుకాణాలు ఏర్పడ్డాయి. వీటికి అనుసంధానంగా ఉన్న మురుగు కాలువలపై శాశ్వత సిమెంటు మూతలు వేశారు. ఈ కారణంగా కాలువల్లో పేరుకున్న మురుగు తొలగించడం సాధారణ కార్మికులకు కష్టంగా మారింది. అందువల్లనే పల్నాడు జిల్లా వినుకొండ ప్రాంతానికి చెందిన పారిశుద్ధ్య కార్మికులచే ఈనెల ఒకటో తేదీ నుంచి ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారు. పట్టణంలో కిలోమీటరు మేర పక్కా కాలువలు, 3.33 కి.మీ. పొడవునా మేజరు కాలువలు ఉన్నాయి. వీటిల్లో పేరుకుపోయిన చెత్త తొలగించాలంటే ప్రత్యేక పారిశుద్ధ్య కార్మికుల అవసరం ఎక్కువగా ఉంది. ప్రస్తుతం ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఇదే సమయంలో నామ్ రహదారి పొడవునా రెండు వైపులా గల నాలుగు కి.మీ. కాలువల్లో చెత్త తొలగింపు, మురుగునీటి పారుదలకు తీసుకున్న చర్యలు శూన్యం. ఇది పూర్తిగా నామ్ రహదారి గుత్తేదారు మాత్రమే నిర్వహించాల్సి ఉంటుందని పురపాలక సంఘం అధికారులు చెబుతున్నారు. ఈవిషయమై పురపాలక కమిషనర్ ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ దుకాణాల ఎదుట కాలువలపై శాశ్వత కట్టడాలు లేకుండా తాకీదులు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లయితే అందుకు అయ్యే ఖర్చు సదరు దుకాణ యజమాని నుంచి వసూలు చేయనున్నట్లు వెల్లడించారు.